
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!!
సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురో పినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!
సమస్త జగహే గురు స్వరూప చీ ఢసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహేదే జగత్పావనా!



## జన్మదిన సంచిక

ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా
సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ
కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:2 సంచిక:5 త్రైమాసిక పత్రిక డిసెంబర్-1998

# సాయివంటి దైవంబు లేడోయి లేడోయి

ప్రజలందరి నోట సాయి నామం పలకాలి! సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!

ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి! సాయిపద
రవళులు మన హృదయ
కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద
వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి!



ఆ సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన మనసులు
మత్తెక్కాలి! సాయి
ప్రేమామృతధారలు అంతటా
నిరంతరం వర్షించాలి! ఆ
ప్రేమామృత ధారలలో
తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల
మత్తులో ఆనందంగా నర్తిస్తూ

సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

*****************************************************************************************

ఈ సంచికలో


| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయి!లేడోయి | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - | గురు బంధువులు |
| 3. | బాబా నోట దాసగణు వేదాంతం లేదు | డా\|\| సాయినాథుని శరద్బాబూజీ |
| 4. | కోరికలన్నీ తీరేదెలా? | (సాయిపథం నుండి) |
| 5. | ఏది సాక్షాత్కారం? | |
| 6. | సద్గురువుకు పగ్గాలప్పగించు నిశ్చింతగా ఉండగలవు | - పి. సాయిప్రసాద్ - కందుకూరు. |
| 7. | అదే నా ఆశ - ఆశయం - ఆకాంక్ష | - జి. రత్తయ్య - తెనాలి |
| 8. | గురుదేవా! కరుణించవా! | - తాడిపర్తి కనకదుర్గ - తెనాలి |
| 9. | గురువుగారి దర్శనం ఎంత ఎఫెక్టో! | - జి. సీతామాధవి - తెనాలి |
| 10. | అభయ హస్తం! | - పాదర్తి నాగప్రేమ కుమార్ - తెనాలి |
| 11. | నా కుటుంబాన్ని గురుదేవులు రక్షించారు | - కొండేటి జయలక్ష్మి - సంగం జాగర్లమూడి |
| 12. | అడిగిందేమో బాబాని ఇచ్చిందేమో గురువుగారు | - పి. అనిల్ - వేంకటగిరి |
| 13. | బాబా ప్రసాదించిన మధుర ఫలమే శరద్బాబూజీ | - పి. కృష్ణకుమార్ - తెనాలి |
| 14. | డాక్టర్ + డాక్టర్ + డాక్టర్ + డాక్టర్. | - గురుచరణదాసుడు. |
| 15. | ఆ చేయి ఎంత హాయి! | - డా\|\| జి. సాయివరప్రసాదరావు - రేపల్లె |
| 16. | గురుదేవుని కరుణ | - పి. అన్నపూర్ణ - తెనాలి. |

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై||
సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై||

## ఉన్న మాట - అనుకున్న మాట

అది 1997వ సం|| అశ్వీజ మాసం - శిరిడీ పవిత్ర క్షేత్రం - దసరా - బాబా మహాసమాధి చెందిన రోజు - పూజ్య గురూజీ జన్మదినం కూడ - అచటి వేడుకలను వీక్షించటానికి కొత్తగా శిరిడీ వచ్చిన ఒక గురుబంధువు ఆరోజు జరిగిన కార్యక్రమాల నిరాడంబరత - అందరిలో కన్పించే అంకితభావం - ప్రేమతత్త్వం - సేవాదృక్పథం పరికించాడు. ఎవరి ఆజ్ఞ, అధికారం లేకుండా సాగిపోతున్న భోజన, వసతి సదుపాయాలు గమనించాడు. సాయంత్రం జరిగిన సత్సంగంలో గురు బంధువులు తమతమ జీవితాలలో గురూజీ వలన పొందిన అనుభవాలను, అనుభూతులను, తీరిన కోరికలను, నడయాడే దైవం చూపిన లీలలను చర్చించుకుంటుంటే ఆసక్తితో విన్నాడు. ఇంతటి మహాద్భుత విషయాలు కేవలం మౌఖికమై పరిసర శ్రోతలకు మాత్రమే పరిమితమై ఉండకూడదు. ఆంధ్రదేశమంతటా "ఈ లీలా తరంగాలు ప్రతిధ్వనించాలి. ఒక మహిమాన్వితుని మహాత్త్వం పదిమందికీ పరిచయం కావాలి. ఆ పవిత్ర పరిచయంతో మానవులెందరో పునీతం కావాలి" అని ఆకాంక్షించాడు. తన ఆకాంక్షను ఆప్తులకు వివరించాడు. తన చేతకు చేయూతనిమ్మని అర్థించాడు. ఈ ఆలోచనకు గురుబంధువుల అండదండలే గురూజీ ఆశీర్వచనాలుగా లభించాయి ఫలితంగా "గురుకృప" త్రైమాసిక పత్రిక ఆవిర్భవించింది.

పత్రిక ప్రారంభింపబడి సంవత్సరమైంది. ఇది మొదటి జన్మదిన సంచిక. నాలుగు సంచికలలో సాయితత్త్వ శోధకులు, సాయిపథ -సాధకులు, "గురువు" అనే పదానికి ప్రత్యక్షరూపం, నడయాడే దైవం అయిన శ్రీ సాయినాథుని శరద్బాబూజీ అద్భుతలీలలు గురుబంధువుల అనుభవాలుగా ఎన్నో తెలుసుకున్నాం. బాబూజీ కలం నుండి వెలువడిన కొన్ని సాయిపథరవళులను విని పులకించినాము. ప్రస్తుతం ఉచితంగా లభిస్తున్న ఈ పత్రికకు చందాదారులుగా చేరతామని ఎందరో గురుబంధువులు ఉత్తరాల ద్వారా తెలియజేస్తున్నారు. సత్సంగ సభ్యులే కాక సాయిభక్తులు ఎందరో చందాదారులు కావటానికి కుతూహలం చూపిస్తున్నారు. ఈ పత్రిక ఆదరణకు ఫలితాలకు ఇవి కొన్ని నిదర్శనాలు మాత్రమే.

అయితే ఆర్థికమైన ఆలోచనలతో ప్రారంభింపబడిన పత్రిక కాదిది. గురుబంధువుల శ్రద్ధ -సబూరి-సమిష్టి కృషే దీనికి పెట్టుబడులు కావాలని మా ఆకాంక్ష. నిత్యము సమస్యలతో సతమతమౌతున్న మానవాళి గురుబోధలు గ్రహించటంద్వారా, గురుపథం గమనించటంద్వారా, గురుబంధువుల అనుభూతులను అందుకోవటంద్వారా, గురులీలలు అనుభవించటంద్వారా సేదతీరాలని, సంతృప్తి పొందాలని ఈ పత్రిక ఆశయం....

మా ఆకాంక్ష, ఆశయం నెరవేరాలంటే అశేష గురుబంధువులు ఈ పత్రికను క్రమం తప్పకుండా పఠించటంతో బాటు తమతమ అనుభవాలు, అనుభూతులు ఎప్పటికప్పుడు వ్రాసి పంపి పత్రికలో ప్రచురింపబడటానికి సహకరించాలి. గురునామం జపించటం, గురుదర్శనం చేయటం, గురుబోధనలనాలకించటంతో బాటు గురులీలలను మననం చేసుకోవటం, వాటిని పదిమందికీ తెలియజేయటం మొదలైన సత్కార్యాలన్నీ గురుసేవలో భాగాలే. మన అనుభవాల అభివ్యక్తీకరణ మరికొందరికి మార్గదర్శకం కావటం గురు శుశ్రూషలో భాగమేకదా! ఒక దీపం వలన మరొక దీపం వెలిగినట్లే, ఒకరి అనుభవం, మరొకరికి ఆశాదీపం కావాలి. ఈ దృష్టితో, ఆతృష్ణతో గురుబంధువులందరూ తరచూ తమతమ అనుభవాలను వ్రాసిపంపి పత్రిక ప్రచురణకు తగిన సార్థకృత కలిగించాలని కోరుకుంటున్నాం. మీరు సత్సంగాలలో చెప్పే అనుభూతులు మీ ప్రాంతానికే సొంతం కాకుండా విశ్వానికి వినిపించాలనే మా తపనను అర్థంచేసుకొని సహకరిస్తారని ఆశిస్తున్నాం. మొదటి

*జన్మదినోత్సవం జరుపుకొని, రెండో సంవత్సరంలోకి అడుగిడబోతున్న ఈ 'పత్రిక పాప' కు మీ అనుభవాల రచనలే "నడకలు" కాగలవు.*

*బాబాతో ఋణానుబంధం ద్వారా గురూజీ వద్దకు చేర్చబడిన మనం గురూజీ బాటలో పయనిస్తూ "శ్రద్ధ - సబూరీ" అనే సంద్రంలో "సాధన" అనే పడవలో "గురుకృప" అనే చుక్కాని ద్వారా ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు-ముముక్షువులు అనే తరంగాలను దాటుకుంటూ తీరాన్ని చేరుదాం...*

*- గురు బంధువులు.*

## బాబానోట దాసగణు వేదాంతం లేదు!

జులై 89 - సాయిపథం నుండి

ఈనాడు ఎందరో బాబా పేరుతో ప్రచారం చేస్తున్న వేదాంత ప్రవచనాలు పుక్కిటి పురాణాలే కానీ వాస్తవాలు కాదు అనే దానికి నిర్వచనం మన గురూజీ ఈ వ్యాసం - గురుకృప

బాబా ఎప్పుడూ ఆధ్యాత్మికోపన్యాసాలూ, వేదాంత ప్రవచనాలు చెయ్యలేదు. ఎప్పుడైనా సందర్భాను సారం, అలతి అలతి పదాలతో చిన్నచిన్న వాక్యాలలో, అద్భుతమైన ఆధ్యాత్మిక రహస్యాలు వెల్లడి చేశారు. వానిలో కొన్ని మనకు ఈనాడు సాయిసూక్తుల రూపంలో లభ్యమవుతున్నాయి. అంతేకాని వాటిని వివరించేవారు కాదు. వాచా బోధించడం ఆయన పద్ధతి కాదు. బాబా ఎక్కువ భాగం తమ లీలల ద్వారా ఆచరణ ద్వారా చిన్న చిన్న కథల రూపంలో నేరుగా అనుభవాన్ని ప్రసాదించడం ద్వారా బోధించారు. ఈ విషయాన్ని శ్రీ దాసగణు, హేమత్పంతు మొదలయిన శ్రీసయి చరిత్రకారుల మొదలు బాబాను దర్శించి నేటికీ సజీవులైవున్న శ్రీ ఉద్ధవ్‌రావు దేశ్‌పాండే (షామా కుమారుడు) వరకు అందరూ ఏకగ్రీవంగా ప్రకటించివున్నారు.

అయితే శ్రీ దాసగణు రచించిన 'భక్త కథామృతం'లోని 32,33 అధ్యాయాలలోని బాబా సుదీర్ఘ వేదాంత ప్రవచనం చదువుతుంటే పై అనుమానం పాఠకులకు కలగడం సహజం. దీనికే శ్రీదాసగణే మరో చోట స్పష్టంగా వివరణ ఇచ్చారు.

"నానా సాహెబ్ చందోర్కర్‌కి బాబా ఉపదేశించినట్లు నేను వ్రాసిన బాబా బోధయధాతథంగా బాబా చెప్పినది కాదు. నానాకు బాబా చేసిన కొన్ని ఉపదేశాలు, నానసాహెబ్ నాకు చెప్పారు. వాటిని నా సొంత పాండిత్యంతో వివరించి, విశదపరచి ఈ రూపంలో పెట్టాను. ఆ బోధకు మూలమైన సారాంశం మాత్రమే బాబా చెప్పారు. (Devotees's Experience By B.V.N. Swamy P.P.48)

మూలాన్ని ముందు ఇచ్చి, దాని వ్యాఖ్యానాన్ని విడిగా క్రింద పొందుపరచడం సామాన్యంగా చూస్తాము వివరణ వ్యాఖ్యానాలను కూడా మూలానికి జోడించి మూలంలో భాగంగానే చెప్పడం మరాఠీ ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో తరచు కనిపించే విశేషం. దీనికి చక్కని ఉదాహరణ "జ్ఞానేశ్వరీ భగవద్గీత" శ్రీ దాసగణు తన రచనల్లో ఈ సంప్రదాయాన్నే పాటించారని స్పష్టమవుతుంది. శైలి దాసగణు చెప్పే హరికథా సంకీర్తనల కనుగుణంగా వుంటుంది.

అందువల్ల, దాసగణు రచించిన బాబా చరిత్రలో ఇవ్వబడిన సుదీర్ఘమైన బాబా బోధనలు - యథాతథంగా బాబా మాటలు కావు!

## కోరికలన్నీ తీరేదెలా ?

- సాయిపథం నుండి

కోరికల సుడిగుండాలలో పడి అల్లకల్లోలమవుతున్న మనస్సును తెల్ల కాగితంలా ఎలా ఉంచుకోవాలో ఈ వ్యాసంద్వారా గురూజీ చాలా చక్కగా సులభశైలిలో విశదపరిచినారు. మరి మనస్సు అనే తెల్లకాగితాన్ని నూనెలో తడవకుండా కాపాడుకుందామా.... - గురుకృప

ముళ్ళతో నిండివున్న వనములో చెప్పులు లేకుండా నడవలేము. వనమంతా తోలుచే కప్పినట్లయితే నడవగలము. లేదా మన కాళ్ళకు చెప్పులు వేసుకొని తేలికగా నడవగలము. వనమంతా తోలుతో కప్పలేము, కనుక మనము చెప్పులు వేసుకొనుట మంచిది. సంసారములో మానవుడు అంతులేని కోరికలతో బాధపడుతున్నాడు. దానినుండి బయటపడాలంటే రెండే దారులున్నాయి. ఎన్ని కోరికలు కలుగుతున్నాయో అన్నీ తీర్చుకోవడము ఒకటైతే ఆ కోరికలను సంపూర్ణంగా వదలివేయడం ఇంకొకటి. కోరికలన్నింటినీ తీర్చుకోవడమనేది జరగనిపని. ఎందుకంటే ఒక కోరిక తీర్చుకొనే లోపల ఇంకొక కోరిక మొదలవుతునే ఉంటుంది. కనుక తృప్తి, జ్ఞానములతో కోరికలను తుడిచివేయడమే సబబు.

గోకిన కొద్దీ తామర హాయిగా ఉంటుంది. కానీ తరువాత పుట్టే మంట భరించడం ఎవరితరము? అట్లాగే సంసార సుఖాలు మొదట హాయిగా ఉన్నా తరువాత వాటివలన కలిగే బాధలు చెప్పనలవి కాదు.

ఒక గద్ద చేపనెత్తుకొని పోతుంది. ఎన్నో కాకులు, గద్దలు దాని వెంటబడి పొడుస్తూ; కూస్తూ ఆ చేపను లాక్కోవాలని ప్రయత్నిస్తున్నాయి. అది ఎట్లాపోతే అట్లా అని దాని వెనకాల పోతూ దానిని హింసిస్తున్నాయి. ఆ బాధ పడలేక అది తన ముక్కులోని చేపను క్రింద పడేసింది. ఇంకొక గద్ద దానిని తన్నుకొని పోయింది. వెంటనే అన్ని కాకులు దీని వెంటపడ్డాయి. మొదటిది ఏ బాధలేక శాంతంగా ఒక చెట్టు మీద కూర్చొని హాయిగా ఉంది. దాన్ని చూచిన అవధూత దానికి నమస్కారము చేసి ఇట్లన్నాడు "ఓ పక్షిరాజా ! నీవే నాకు గురువు ప్రపంచ సుఖములనే బరువును వదలనంత వరకూ మానవుడు సంసార బాధల నుండి బయట పడితేనే, శాంతిని పొందడనీ నీవు నాకు నేర్పినావు!"

బెదిరే గుఱ్ఱానికి గంతలు కడితేనే గాని సరిగా నడవదు. అట్లాగే లౌకికుని మనసుకు వివేకము, వైరాగ్యము అనే రెండు గంతలు లేకపోతే అది పెడదారి పట్టి తప్పుడు పనులు చేస్తుంది.

చమురు తడిసిన కాగితము మీద వ్రాయలేము. అదే విధంగా కోరికలనే నూనెలోనాని పాడైన మనసు పరమార్థ సాధనకు పనికిరాదు. కాని నూనె కాగితము మీద సుద్దను అద్దితే వ్రాయడానికి పనికొస్తుంది. అదే విధంగా వైరాగ్యమనే సుద్దను అద్దితే సంసారములో చిక్కుకొన్న వాడి మనసు తిరిగి సాధనకు పనికొస్తుంది.

## ఏది సాక్షాత్కారం ?

- సాయిపథం నుండి

ఈ ఆర్టికల్ లో మన గురూజీ ఏది సాక్షాత్కారం? అనే ప్రశ్నని మనపైకి వదిలారు. ఈ రోజు మన అందరి పరిస్థితి కూడా అలాగే డోలాయమానంగా వున్నది. "నిత్యం మన మధ్య కదలాడే దైవంగా వున్న మన గురూజీలో ఎందరు బాబాని దర్శించుకొనగలుగుతున్నారు?" అని మనకుగా మనం ప్రశ్నించుకొంటే నిజంగా బాబాని దర్శించు కొనగలుగుతాము. అప్పుడే అది నిజమయిన సాయిబాట. అదే సాయిపథం. అదే గురూజీ మనకు చూపకనే చూపిన రాచబాట.... - గురుకృప

శ్రీ సాయిబాబా శిరిడీలో తమ భౌతిక శరీరంతో సంచరిస్తున్నప్పుడు దర్శించిన భక్తులు ఎంత ధన్యులో అని ఈనాడు మనం అనుకుంటాము. బాబా 'అలా' మనకు భౌతికంగా 'సాక్షాత్కారించాలని' తపిస్తాము. కాని, ఆనాడు బాబాను శిరిడీలో దర్శించు కొన్నవారికి బాబా దర్శనం ఒక సాక్షాత్కారంగా అనిపించకపోవడం సహజం. ఆనాడు కూడా బాబా శిరిడీలో కాక మరోచోట కొందరికి "భౌతికంగా" కనిపించినా (ఉదా|| బలరాం మాన్క్ కు మచ్ఛీంద్ర గఢ్ లో, మహల్సాపతికి జజూరిలో దర్శనమిచినట్లు) కనీసం స్వప్న దర్శన మిచ్చినా దాన్ని సాక్షాత్కారంగా భావించారు కానీ, 'అందరికీ' కనిపిస్తూండే రూపాన్ని సాక్షాత్కారమని భావించలేకపోయారు.

బాబాను అత్యంత సన్నిహితంగా సేవించిన ప్రముఖ భక్తులలో శ్రీ దాసగణు మహరాజ్ ఒకరనే విషయం సాయి భక్తులందరకూ తెలిసిందే. కానీ దాసుగణు బాబాను తన గురువుగా భావించేవాడు కాదు! దాసగణుకు ఇస్లాంపూర్ నివాసియైన వామన్‌సాషి అనే బ్రాహ్మణ గురువు వేరేవున్నాడు. ఆ గురువు వద్ద మంత్రోపదేశం కూడా పొందాడు. మొదట శివ భక్తునిగా వుండి తరువాత పండరి విఠలునిచే ఆకర్షింపబడి వార్కరీ సాంప్రదాయంలో తన సాధన కొనసాగించాడు.

బాబా ఒకసారి దాసుగణును భాగవత సప్తాహం చెయ్యమని ఆదేశించారు. అప్పుడు దాసగణు బాబాతో, "బాబా నాకు సాక్షాత్కారం కావాలి, నీవు చెప్పినట్లే భాగవత సప్తాహం చేస్తాను. కానీ దాని ఫలంగా నాకు సాక్షాత్కారాన్ని అనుగ్రహిస్తారా?" అని అడిగాడు. దానికి బాబా, "విఠలుడు కనిపిస్తాడు, కానీ ఆయన్ను చూడడానికి తీవ్రమైన (భక్తి) భావం ఉండాలి", అని సమాధాన మిచ్చారు. దాసుగణు సప్తాహం పూర్తిచేశాడు. కానీ 'సాక్షాత్కారం' కలగలేదు. అప్పుడు దాసగణు బాబాను "నాకు సాక్షాత్కారం అనుగ్రహిస్తానని మాట ఇచ్చారు. కానీ కాలేదు" అని ఫిర్యాదు చేసాడు. "అలానే" "సాక్షాత్కారం" పొందుతావులే! కొంచెం వేచిచూడు!" అన్నారు బాబా.

తరువాత కొంతకాలానికి 1916 బాద్రపద మాసంలో పండరి యాత్ర చేయాలని సంకల్పించుకొన్నాడు కానీ, నానాసాహెబ్ చందోర్కర్ వత్తిడి చేసి అతణ్ణి శిరిడీ తీసుకొచ్చి బాబా అనుమతితో సంకీర్తనలు నిర్వహించమని కోరాడు. అలా, నేడూ రేపు అంటూండగానే ఆశ్వయుజ మాసం కూడా వచ్చింది. బాబా తన పండరి యాత్రను ఆటంకపరచారని దాసుగణుకు మనసులో బాధగా వుంది. "భగవంతుడైన పండరినాథుని దర్శించడానికి అడ్డుపడుతున్న ఈ బాబా ఏం గురువు? అని ఒకసారి అనుకున్నాడు కూడా. అలా అతననుకొన్న వెంటనే బాబా నానాసాహెబ్ చందోర్కర్ తో, "నానా ఇతడు పండరి పోతానంటే ఆపవద్దు!" అని, దాసుగణును పిలచి నీవిక పండరిపురం వెళ్ళు" అన్నారు దాసగణు, "బాబా, మీరు చాలాకాలంగా నాకోరికను దాటవేస్తున్నారు. నాకు సాక్షాత్కారం ఎప్పుడు అనుగ్రహిస్తారు"? అని అడిగాడు. దానికి బాబా, "ఇప్పుడు నన్ను చూస్తున్నావు కదా? అదే సాక్షాత్కారం నేనే దైవాన్ని!" అన్నారు. "ఇటువంటి దేదో చెప్తారని అనుకొంటూనే వున్నాను. మీరు చెప్పింది నాకు తృప్తిగా లేదు" అంటూ, తన ప్రారబ్ధంలో 'సాక్షాత్కారం' పొందే రాతలేదని సరిపెట్టుకొన్నాడు దాసగణు.

బాబా దాసుగణు కిచ్చిన సమాధానం చదువుతూవుంటే, బైబిల్ లో ఏసుక్రీస్తు చెప్పిన మాటలు గుర్తుకొస్తాయి. బాబాను దాసుగణు అడిగినట్లే ఏసుక్రీస్తును ఆయన సన్నిహిత భక్తుడైన ఫిలిప్ అడుగుతాడు "ప్రభూ, మాకు స్వర్గంలో వున్న ఆ తండ్రిని చూపించి, సంతృప్తిని ప్రసాదించండి" అని, దానికి ఏసుప్రభువు 'ఫిలిప్, నీవు ఇంతకాలం నాతో వున్నా నన్ను తెలుసుకోలేదు. నన్ను చూస్తే ఆ తండ్రిని(దైవాన్ని) చూచినట్లే! అయినప్పుడు, (ప్రత్యేకంగా) మళ్ళీ ఆ తండ్రిని చూపమని నీవడగడమేమిటి? ........... నామాట నమ్ము. నేను ఆ తండ్రిలో వున్నాను. ఆయన నాలో వున్నాడు" అని సమాధాన మిచ్చారు

## పిన్నారా ! కన్నారా !

పిన్నారా ! కన్నారా ! శరత్ గురూజీసి చూచారా!
వారి శక్తిసి మీరు కాంచారా ! ||పి||

శిరిడీవాసా శరత్ గురు - శ్రితజనరక్షక శరత్ గురు !
ఆశ్రమవాసి శరత్ గురు - తేజోమూర్తి శరత్ గురు ! ||పి||

సమర్థ సద్గురు శరత్ గురు - వరముల నొసగే శరత్ గురు !
సాయినాథుసి శరత్ గురు - ప్రేమస్వరూపా శరత్ గురు ! ||పి||

సత్సంగ బోధక శరత్ గురు - సాయిపథగామి శరత్ గురు !
సర్వతీర్థయామి శరత్ గురు - శరణం దేవ శరత్ గురు ! ||పి||

ఆనందదాత శరత్ గురు - అభయ ప్రదాత శరత్ గురు !
ఆర్తజనావన శరత్ గురు - ఆర్తుల బ్రోవుము శరత్ గురు ! ||పి||

డా|| పి.రామమోహనరావు. తెనాలి

## సద్గురువుకు పగ్గాలప్పగించు సిశ్చింతగా ఉండగలవు

సాక్షాత్తూ భగవత్స్వరూపుడయిన బాబాకు మన బాధలు, అవసరాలు, పిచారాలు అన్నీ సివేదించి హృదయపూర్వకంగా నమస్కరించిన తరువాత మరి చింతకు తావులేకుండా ఉండగలగడము శరణాగతిలో భాగం. సాధారణంగా ప్రపంచమునకు సంబంధించిన మనకోరికలపట్ల మనకున్న వ్యామోహం వలన ఆ కోరికలు సెరవేరినపుడే మనకు సుఖము, ఆనందము లభిస్తాయని భాపిస్తాము. ఆ సద్గురునాథుడు నీ కోరికలను సెరవేర్చుడేమోనన్న ఒక శంక హృదయాంతరాళాలలోని ఒక మూల పట్టిపీడిస్తూనే ఉంటుంది. సకల జీవుల హృదయాంతర్వర్తియై సర్వత్రాతానే సిండి ఉన్నానని తన లీలల ద్వారా శ్రీసాయి చెప్పక చెప్పిన సత్యాన్ని అనేక జన్మల కర్మఫలితంగా సంప్రాప్తించిన బంధాలవల్లనో, అజ్ఞానం వల్లనో మనస్ఫురణలో ఉంచుకోము. ఈ స్ఫురణ ఎవరికయితే ఉంటుందో వారికి సద్గురువుకు పగ్గాలు అప్పగించడము సాధ్యమవుతుంది. ఎందుకనగా, సకలజీవుల హృదయాలలో ఉండి, సర్వత్రాసిండి, సకలాన్ని శాసిస్తున్న ఆ సద్గురునాథుడు అపారమయిన తన కరుణచే సదాతన భక్తులను రక్షిస్తుంటాడన్నది తన అనుభవంగా కలిగి ఉంటాడు. కనుక ఆ సద్గురునాథుసి ఆరాధనలో తను అశ్రద్ధ చూపినా తన అనుగ్రహంతో తనను ఎంతో శ్రద్ధగా సకాలంలో రక్షిస్తాడన్నది భక్తుల అనుభవం. ఇటువంటి స్ఫురణ ఆ సద్గురు కృపాకటాక్ష పీక్షణాల వల్ల గాక మరిదేసి వల్ల సాధ్యము - అటువంటి స్ఫురణ ప్రసాదించమసి ఆయనను సిరంతరం ప్రార్థిద్దాం ఆ సద్గురు చరణ కమలాలయందు శరణువేడుదాం.

తార్కాడ్ సిరుద్యోగియై కుటుంబపోషణ ఎలా జరపాలో దిక్కుతోచక బాబా మీద భారం వేసి రెండు, మూడు సెలలు శిరిడీలో బాబా సన్నిధిలో గడపాలసి కుటుంబ సమేతంగా శిరిడీ చేరుకుంటాడు. తరువాత బాబా తార్కాడ్ను పిలిచి వెంటనే ఇంటికి బయలుదేరమసి అదికూడా పూనామీదుగా పొమ్మసి ఆదేశిస్తారు. సిరుద్యోగంతో బాధపడుతున్న తార్కాడ్కు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి శిరిడీ చేరిన వెంటనే తిరిగి తన స్వగ్రామానికి అదీ చుట్టుదారి అయిన పూనా మీదుగా పోవలసిరావడం అంతగా రుచించలేదు. అయినా బాబా ఆజ్ఞ

కనుక పూనాకు బయలుదేరాడు. పూనాలో ఒక బట్టల మిల్లులో కార్మికుల సమస్యలు తలెత్తి యజమాని సమర్థుడయిన మేనేజరు కొరకు అన్వేషించి తార్కాడ్ సమర్థుడని అనుకొని, తార్కాడ్‌ని మేనేజరుగా నియమించాలనుకున్నాడు.తార్కాడ్ కోసం కబురుచేసాడు. ఇంతలో తార్కాడ్ పూనా వస్తున్నారని యాజమాన్యానికి తెలిసి వారు స్టేషనుకు వెళ్ళి స్వాగతం పలికి విషయం వివరించి ఫ్యాక్టరీకి తీసుకొనివెళ్ళారు. తార్కాడ్ ఆనందానికి అవధులు లేవు. సకల జీవుల హృదయాంతర్వర్తి అయిన సాయినాథునికి తనపైనే భారం వేసి కుటుంబసమేతంగా శిరిడీ చేరిన తార్కాడ్ అవసరం తెలియకుండా పోతుందా. అలా తెలిసి తార్కాడ్ ప్రమేయం లేకనే ఒక పెద్ద మిల్లుకు మేనేజరుగా నియమింపబడేలా బాబా అనుగ్రహించారు. నిజానికి బాబా మీద భారం వేసి రెండు, మూడు నెలలు శిరిడీలోనే గడపాలని వచ్చిన తార్కాడ్ రెండు, మూడు రోజుల్లోనే ఆయనకు చింత తీర్చి జీవితంలో పట్టునిచ్చి బాబా వారి ఇంటిని నిలబెట్టారు. ఆయన మీద భారం వేసిన ప్రతి భక్తునికి బాబా అనుగ్రహం ఇలానే లభిస్తుంది. ఇది అర్థం చేసుకొనిన భక్తుని మదిలో చింతకు తావేది!

అలా ఒక సారి నేను ముందుగా అనుమతి తీసుకోకుండా 3 నెలలు సెలవుపై శిరిడీ వెళ్ళాను, వెళ్ళాను అనడంకన్నా శిరిడీలో ఉంచబడ్డాను. అదీ బాబా సన్నిధిలో, సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ సన్నిధిలో, గురుదేవుల సన్నిధిలో ఉన్నానన్న ఆనందం ఉన్నప్పటికీ రీ-పోస్టింగ్ ఆర్డర్స్ కొరకు మళ్ళీ హైదరాబాద్ వెళ్ళి ప్రయత్నం చేయవలసి వస్తుందేమో అన్న శంక లోపల పీడిస్తూనే ఉంది. అది జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలు అయినందువలన విద్యార్థులకు పనిదినాలలో పాఠాలు చెప్పకుండా శిరిడీలో ఉండడం ఒక విధంగా నేరం. అందువలన ఏ ప్రిన్సిపల్ అయినా నా జాయినింగ్ రిపోర్ట్ తీసుకోకుండా నిరాకరించి రీ - పోస్టింగ్ ఆర్డర్స్ తెచ్చుకోమనే అనవచ్చు. చివరకు గురువుగారి ఆశీస్సులతో, అనుమతితో మార్చి మాసాంతంలో కాలేజిలో తిరిగి చేరడానికి నేరుగా కందుకూరుకు వచ్చాను. ప్రిన్సిపాల్ రిపోస్టింగ్ ఆర్డర్స్ తెచ్చుకొమ్మని అంటాడనుకొని నా జాయినింగ్ రిపోర్ట్ ఆయనకిచ్చాను. ఒక్క మాట మాట్లాడకుండా జాయినింగ్ రిపోర్ట్ పై సంతకం చేసి అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకము చేయమన్నారు ప్రిన్సిపాల్ గారు. ఆనందము, ఆశ్చర్యము, విస్మయము ఒక్కసారిగా నన్నుముంచెత్తి ఆనందాశ్రువులు రాలుతూ ఉండాగా రిజిష్టరులో సంతకం చేసాను. అప్పుడుగాని సద్గురువుపై భారం వేసిన వాడి హృదయంలో చింతకు తావులేదన్నది అనుభవమునకు రాలేదు. ఆ అనుభవమును ఇచ్చిన సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీకి మనసులో పదివేల నమస్కారములు సమర్పించి ఆయన మీద భారంవేసిన వారందరూ నిశ్చింతగా ఉంటారని తెలుసుకున్నాను. అదే సద్గురువుకు పగ్గాలప్పగించి నిశ్చింతా ఉండగలగటమంటే. అదే మనకు బాబా పథం - సద్గురు పథం.

6-12-98 పి. సాయిప్రసాద్

## అదే నా ఆశ - ఆశయం - ఆకాంక్ష

1992వ సంవత్సరము తెనాలి నుండి బాబా దర్శనం కోసం, గురూజీ ఆశీస్సుల కోసం ఒక గురుబంధువు శిరిడీ దర్శించాడు. బాబా దర్శనంతోబాటు గురూజీ ఆశీస్సులు తీసికొని తిరుగు ప్రయాణంలో "తెనాలిలోని గురు బంధువులకు మీ ఆశీస్సులు ఇవ్వండి" అని అడిగాడు. అప్పుడు గురువుగారు తెనాలిలోని సత్సంగకేంద్రానికి, సత్సంగ సభ్యులకు ఒక సందేశంగా వారి ఆశ, ఆశయం, ఆకాంక్ష ఏమిటో ఈ క్రింది విధముగా తెలియచేశారు.

"ప్రజలందరినోట ........................... మనం చేయగలిగింది, చేయవలసింది" గురువుగారి పై ప్రవచనం గురుబందువులందరికీ సుపరిచితమే. (గురుకృప 2వ పేజీ)

1-10-98వ తేదీన శిరిడీలో జరిగిన ఒక సంఘటన గురువుగారి పై సందేశంలోని ఆశ, ఆశయం, ఆకాంక్షలను సఫలీకృతం చేసిందనిపించింది.

ఎప్పటిలాగే గురుబంధువులు 1998 అక్టోబరు 1వ తేదీన బాబా 80వ మహాసమాధి చెందిన రోజున గురూజీ 44వ జన్మదినోత్సవ వేడుకల్ని శిరిడీలో సామూహికంగా జరుపుకుంటున్నారు. దసరా పర్వదినాన సాయంత్రం గం||3లకు గురుబంధువు లందరూ "సాయియానా" నుండి వివిధ సత్సంగ బ్యానర్లను చేతబూని, స్త్రీలు, పురుషులు రెండు బారులుగా కదంతొక్కుతూ, అనేక కంఠాలతో సాయి నామాన్ని ఏక కంఠంలా ప్రతిధ్వనింప చేస్తూ బాబా సమాధి మందిరానికి కదలి వెడుతున్నారు. ఆ భక్త సమూహంలో ఉన్న ప్రతి గురు బంధువునోట సాయినామం వీనుల విందుగా వినిపిస్తోంది. (ప్రజలందరి నోట సాయి నామం పలకాలి)

అప్పటి వరకు ప్రశాంతంగా వున్న ప్రకృతి నుండి శీతల పవనాలు ప్రారంభమైనాయి. వరుణ దేవుని కరుణ జలం కుండపోతగా వర్షిస్తోంది. "సాయియానా" నుండి బయలు దేరిన భక్తుల సాయి నామ ప్రభంజన హోరు "పింపుల్ వాడీ" రోడ్డు చేరింది. భక్తుల శ్రద్ధ - సబూరీలను పరీక్షించటానికా అన్నట్లు వర్షం మరింత పెద్దదయింది. భౌతిక దేహం వర్షపు ధారలలో తడిసి ముద్దవుతున్నా వారి మనస్సు మాత్రం సాయినామగాన లహరిలో పరవశించి పోతోంది. కనుల కెదురుగా కారే ప్రతి చినుకులోనూ సాయి రూపం ప్రత్యక్షమవుతూ ప్రకృతిలోని అణువణువునూ రంజింపచేస్తోంది. (సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి).

అంతటి వర్షం కురుస్తున్నా షుమారు వేయి మంది గురుబంధువులున్న ఆ క్యూ నుండి చిన్నా, పెద్దా ఎవ్వరూ ఒక్క అంగుళం కూడా బయటికి రావాలనుకోకపోవటం "సాయిమహిమ"కు నిదర్శనం (ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి).

ఆ సమయంలో భక్త బృందం నోట సాయి నామం తప్ప మరొక మాటలేదు. సాయి రూపం తప్ప మరొక దృశ్యం వారికి కనిపించడం లేదు. బాబా సమాధి మందిర పథగాములైన భక్తుల హృదయ కుహరాలలో తన్మయత్వ నిశ్శబ్ద నిశీధి ఆ నిశీధిలో సాయి పథ రవళుల ప్రతి ధ్వనులు. (సాయి పథ రవళులు మన హృదయ కుహరం లోని నిశ్శబ్ద నిశీధిలో ప్రతిధ్వనించాలి).

ఆ ప్రతిధ్వనుల ప్రతి స్పందనలు బాబా భజన రూపంలో ప్రణవనాద వీచికల్లా ఎడద లోతుల నుండి బయల్పడుతూ, సాయి జ్ఞాన సౌరభాలు ఆమార్గమంతా వ్యాపింపచేస్తున్నాయి. (ప్రణవనాద వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు సర్వత్రా వ్యాపించాలి)

బాబా నడిచిన శిరిడీ గ్రామంలో, ద్వారకామాయి వీధులలో భక్తులు సాయి ప్రేమామృతధారలా కురుస్తున్న జడివానలో మత్తెక్కిన చిత్తాలతో నడుస్తూంటే, ద్వారకమాయి దారిలోని దుకాణదారులందరూ ఆశ్చర్యానందాలతో వీక్షిస్తున్నారు. (ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో మన మనసులు మత్తెక్కాలి. సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి)

విడవకుండా కురుస్తున్న, కుండపోత వర్షంలో తడుస్తున్న గురు బంధువులు మధువుగ్రోలిన తుమ్మెదల్లా జ్ఞాన సౌరభాల మత్తులో "సాయివంటి దైవంబు లేడోయి - లేడోయి" అని ఏక కంఠంతో గానం చేస్తూ కోలాటాలతో, చెక్క భజనలతో ఆనందంగా నర్తిస్తూ , ద్వారకామాయి, గురుస్థాన్, మీదుగా ప్రదక్షిణంగా సాయి మందిరం చేరి బాబా ఆశీస్సులు పొంది తిరిగి "సాయియానా" కి వచ్చారు. (ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆజ్ఞాన సౌరభాల

మత్తులో ఆనందంగా నర్తిస్తూ "సాయివంటి దైవంబు లేడోయి - లేడోయి !" అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి).

వారి మధుర స్వప్నాన్ని సాఫల్యం చేస్తున్నట్లుగా, తన ఆశ - ఆశయ, - ఆకాంక్షలకు ప్రత్యక్ష రూపాన్ని కల్పిస్తున్నట్లుగా, బారులుతీరిన గురుబంధువులు అనన్య ప్రేమతో, ఆర్ద్రతతో చేసే సాయి ప్రార్థనా దృశ్యాన్ని వీక్షించటానికి ఎటువంటి సూచనా లేకుండా, నడయాడే దైవమైన గురుదేవులు శరద్బాబూజీ గృహం నుండి బయటకు వచ్చారు.

"సాయియానా" ముందు భక్తి తన్మయత్వంతో, కోలాట భజనలతో, నామస్మరణ, నాట్యాలతో అలసి సొలసిన గురుబంధువులు, గురుదేవుల హఠాద్దర్శనంతో, ఆనంద పరవశులైనారు.

గురూజీ ఆశని, ఆశయాన్ని, ఆకాంక్షను నిజం చేసిన ఆనాటి సంఘటనను, మనసును పరవశింపచేసిన ఆ దృశ్యాన్ని మాటల రూపములో మీకు అందించ గల్గుతున్నాను.

గట్టా రత్తయ్య - తెనాలి

## "గురుదేవా ! కరుణించవా"

మాది తెనాలి. మా వారు ఒక బట్ట కొట్లో గుమస్తా. మేము గురువుగారి దయవల్ల నర్సాపురం దగ్గర ఒక షాపు పెట్టుకోవాలనుకున్నాము. మా ఊరు తుమ్మలలో మాకు పొలము వున్నది. ఆ పొలము అమ్మితేనే షాపు పెట్టుకునేందుకు వీలవుతుంది. కాని మూడు నెలల నుంచి ఆ పొలము అమ్మేదానికి జాప్యం జరుగుతూంది. ఇట్లా ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కావటంలేదు. తీరా అది చూస్తే ఆ షాపుగల వాళ్ళు గవర్నమెంట్ స్థలములో షాపులు కట్టినారు. అందువల్ల ఆ షాపులు వాళ్ళు పడగొట్టేసినారు. మేము కనుల ఆ పొలము అమ్మి ఆవూరు వెళ్ళినట్లైతే మాకు మేలుజరిగేదికాదు. నేను తెనాలిలో జరిగే సత్సంగమునకు సంవత్సరము నుండి వెళ్తున్నాను. నేను గురువుగారిని ఒక్కసారి కూడా దర్శనము చేసుకోలేదు. కాని గురువుగారు నాయందు కరుణించి మాకు ఈ మేలు చేసినారు

తాడిపర్తి కనకదుర్గ, తెనాలి.

## "గురువుగారి దర్శనం ఎంత ఎఫెక్టో"

నా పేరు సీతామాధవి. తెనాలిలో గవర్నమెంటు హాస్పటల్ దగ్గరున్న చైతన్య గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్నాను. మా అమ్మగారికి గుండెలో చిన్న రంధ్రం వుంది. ఆపరేషను చేయాలని డాక్టర్లు చెప్పారు. సీరియస్ అనికూడా అన్నారు. గురు బంధువులతో చెప్పగా బాబా ఊదీ ఇచ్చారు. ఆ రోజు రాత్రి మా అమ్మగారిని తీసుకొని మానాన్నగారు హైద్రాబాదు "అపోలో"లో పరీక్ష చేయించటానికి వెళ్ళారు. డాక్టర్లు సీరియస్ ఏమీకాదు. చిన్న ఆపరేషన్ భయపడవలసిన పనిలేదు అన్నారు. ఆమాట నేను విన్నతర్వాత నాకు నిశ్చింత కలిగింది. బాబా మీద ప్రేమ పెరిగింది. సత్సంగ కేంద్రంలో సాయిబాబా వారి జీవిత చరిత్ర సప్తాహం నిర్వహించగా నేను కూడా పాల్గొన్నాను. సప్తాహం ప్రారంభించిన మూడవ రోజు రాత్రి మా అమ్మగారికి వంట్లో బాగుండలేదు. ఆ రోజు రాత్రి షుమారు 1-2 గంటల ప్రాంతంలో మా అమ్మగారు స్పృహలేకుండా పడివుండాగా, మానాన్నగారు బాబా నామస్మరణ కాసేపుచేసి, డాక్టరు గారి దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి రిక్షా కోసం వెళ్ళగా, నేను బాబా వారి పాదాల దగ్గర కూర్చొని ఏడుస్తున్నాను. ఇంతలో మా అమ్మగారు కలవరించారు. ఏమిటా అని దగ్గరకు వెళ్ళగా, బాబా వారు ఊదీ తీర్థం తీసుకొమ్మని నాకు కనిపించి చెప్పారు అని అనగా నేను బాబా వారి ఊదీ, వారి పాదాలకు

తాకించి నీళ్ళల్లో కలిపి ఇవ్వగా, మా అమ్మగారు ఐదు నిమిషాల్లో తేరుకున్నారు. అప్పటి నుంచి మా అమ్మగారు ఆరోగ్యంగా వున్నారు. బాబాగారు మా అమ్మతో నీకేం భయంలేదు అని కూడా ధైర్యం చెప్పారట. పుట్టపర్తి డాక్టర్లు కూడా భయంలేదు ఒక సంవత్సరములో ఆపరేషను చేయించాలి అని 1995 మే నెలలో పరీక్షచేసి చెప్పారు. కానీ ఇంత వరకు మేము ఏమి ఆపరేషన్ చేయించలేదు. కానీ మా అమ్మగారు క్షేమంగానే వున్నారు.

1995, అక్టోబరు 1వ తారీఖున శ్రీ గురువుగారి దర్శనం శిరిడీలో మొదటి సారిగా చేసుకున్నాను. గురువుగారికి నా బాధలు చెప్పుకున్నాను. తిరిగి 1996 మార్చి 9వ తేదీన తిరుమలలో గురువుగారి దర్శనం చేసుకున్నాను. ఏప్రియల్ 22, 1996లో తిరిగి గురువుగారి దర్శనం, బాబా వారి దర్శనం శిరిడీలో చేసుకున్నాను. ఈసారి గురువుగారిని మా అమ్మగారికి ఆపరేషన్ లేకుండా సంపూర్ణ అరోగ్యం కలిగించండని వేడుకున్నాను. గురువుగారు తప్పక కరుణిస్తారని నా నమ్మకము. గురువుగారు మాత్రమే నన్ను శిరిడీకి తీసుకొని వెళ్ళారు. అంతకు ముందు ఎన్నిసార్లు ప్రయత్నించినా, వారి దర్శనం నాకు కలుగలేదు. గురువుగానిని అడిగిన వెంటనే నాకు వారి దర్శన భాగ్యాన్ని, శిరిడీ దర్శించే భాగ్యాన్ని కలుగచేసారు. అందుకు నాకు గురువుగారి మీద ఎంతో విశ్వాసం, ప్రేమ కలిగాయి, పెంపొందాయి. గురువుగారికి దణ్ణం పెట్టుకొని, వారి ఊదీ పెట్టుకోగానే నా కున్న మానసికమైన సమస్యలు తీరిపోయాయి. నాకున్న అనారోగ్యాలెన్నో గురువుగారు తగ్గించారు. గురువుగారిని మొదటిసారి దర్శించిన తర్వాత చెప్పలేనంత ఆనందం కలిగింది. నాకు తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీవారే అని అనిపించింది. వారు లేనిదే నాకు జీవితం లేదు అని అనిపించింది. గురువుగారు నాకు బ్యాంకులో ఉన్న సమస్యలను, ఇంట్లోవున్న ఎన్నో సమస్యలను చిటికెలో తీర్చేస్తున్నారు. నాట్రాన్స్‌ఫరు గూర్చి గురువుగారిని ప్రార్థించగా వారు నన్ను తెనాలిలో వున్న మారీసుపేట బ్రాంచి నుండి తెనాలిలోనే వున్న మరో బ్రాంచికి అనగా, గవర్నమెంట్ హాస్పటల్ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేయించారు. వారి అనుగ్రహం లేనిదే నాకు తెనాలికి ట్రాన్స్‌ఫరు జరిగేదికాదు. మానాన్నగారు దాదాపు ఒక సంవత్సరము నుండి ఏ వూరికి పోస్టింగుస్లేక జీతం లేక బాధపడుతుండగా, గురువుగారిని మా కుటుంబ సభ్యులందరం తిరుమలలో దర్శించుకోగానే పోస్టింగ్స్ ఇచ్చారు. ఎన్ని విధాలుగా అంతకు ముందు ప్రయత్నించినా జరుగని పని చిటికెలో జరిగి పోయింది. గురువుగారి దర్శనం ఎంత ఎఫెక్టో అని నాకు తెలిసింది. గురువుగారి పట్ల నాకుగల ప్రేమ, నమ్మకం రెట్టింపు అయ్యింది. మాకు సరి అయిన ఇల్లు అద్దెకు దొరకక దాదాపు ఐదున్నర సంవత్సరములు ఇరుకైన ఇల్లు సౌకర్యాలు సరిగాలేక చాలా బాధపడినాము. ఎంత ప్రయత్నించినా సరి అయిన ఇల్లు దొరకలేదు. ఇంటివారు మా అబ్బాయి వాళ్ళు ఈ ఇంట్లో వుంటారు. మీరు తొందరగా ఇల్లు ఖాళీ చేయండి అని రోజూ మమ్మల్ని ఇబ్బంది పెడుతుండగా, నేను ఒక గురువారం నాడు గురువుగారిని మాకు సరైన ఇల్లు సత్సంగానికి దూరంగాలేని ఇల్లు, చూపించండి అని అడిగాను. మరుసటి రోజే శ్రీమతి సుధాగారని ఒక లెక్చరర్ గారు బ్యాంకుకు ఫోన్ చేసి మీనాన్నగారు ఏడు రోజుల క్రితం మా ఇల్లు చూసి వెళ్ళారు. అప్పుడు మేము వేరే వాళ్ళకు ఇల్లు ఇస్తామని మాట ఇచ్చాము అని అన్నాము, కాని ఇప్పుడు మీకే ఇద్దామనుకుంటున్నాము అని చెప్పారు. ఆ ఇల్లు మాకు సరిగా సరిపోతుంది. అన్ని సౌకర్యాలు వున్నాయి. ఆ ఇంట్లోనే మేము చేరాము. అద్దెకూడా మాకు అనుకూలంగా వుంది. ఐదున్నర సంవత్సరములలో ఇల్లు దొరకనిది, గురువుగారు ఒక్క రాత్రిలో మాయింటి సమస్యను తీర్చేసారు. గురువుగారి కరుణను నేను మాటలలో చెప్పలేను. వారు వారి కరుణను నామీద ప్రతిరోజూ, ప్రతి నిముషం చూపిస్తారు. వారి ప్రేమను నేను ఏ విధంగా చెప్పాలో, వర్ణించాలో తెలియటంలేదు. భక్తి పెరగాలి అని వారిని వేడుకుంటున్నాను. వారి సన్నిధిలో ఎక్కువ కాలముండాలనిపిస్తుంది. వారు నాకోరికను తప్పక తీరుస్తారని నా నమ్మకము.

తేది. 23 - 06 - 1996 జి.సీతా మాధవి, తెనాలి.

*నాపై విశ్వాసముంచి, ఓరిమితో వుండు, నీవెక్కడున్నా నీవెంట నేనుంటాను*

## "అభయ హస్తం"

నా పేరు పాదర్తి నాగ ప్రేమకుమార్, తెనాలి. నేను ఫిబ్రవరి నెల 1995వ సంవత్సరము శ్రీశైలములో మా గురువుగారు, సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబు గారిని దర్శనం చేసుకున్నాను. మా నాన్న గారికి పాస్ ఫోర్టులు బుక్ చేసి ఇచ్చే వ్యాపారము. ఒకసారి మానాన్నగారికి ఒక వ్యక్తి రూ|| 60,000 ఇచ్చి ఫారన్ టిక్కెట్టు మరియు పాసుపోర్టు బుక్ చేయమని ఇచ్చినారు. కాని మానాన్న గారికి గ్యాంబ్లింగు అలవాటువున్నది. అప్పుడు మానాన్నగారి హైద్రాబాదు వెళ్ళినారు, టిక్కెట్టు పని మీద. కాని నాకు మా నాన్నగారి మీద అనుమానం ఉండి నేను కూడా హైద్రాబాద్ వెళ్ళినాను. అప్పటికి మానాన్నగారి దగ్గర ఆ 60,000/-లకు గాను 10,000/- మాత్రమే ఉన్నవి. అప్పుడు నాకు చాలా భయము వేసినది. ఈ టిక్కెట్టు బుక్ చేయకపోతే తెనాలిలో మా కుటుంబం చాలా ఇబ్బందులలో పడవలసి వుంటుంది. వెంటనే నేను మా గురువుగారిని ప్రార్థించినాను. ఆ మరుసటిరోజున రెండవరోజున ఆ గ్యాంబ్లింగ్ లో డబ్బులు పోయినవి మరల వచ్చినవి. అప్పుడు పోయినవి కాకుండా 10,000/- రూపాయలు ఎక్కువ కూడా వచ్చినవి. వెంటనే నేను అక్కడనే వుండి ఆ టిక్కెట్టుకు డబ్బులు కట్టించి వెంటనే తెనాలి వచ్చినాను. ఈ అనుభవం చదవడానికి, వినడానికి ఒక మోస్తరుగా వున్నా, నాకు మాత్రం ప్రాణ సమానం లాంటిది. అందువలన ఈ అనుభవం మీకు తెలియపరుచుచున్నాను. నా జీవితంలో ఈ అనుభవం మరవురాని సంఘటన.

తేది. 23 - 06 - 1996 పాదర్తి నాగ ప్రేమకుమార్, తెనాలి.

## నా కుటుంబాన్ని నాగురుదేవులు రక్షించారు

నేను సంగం జాగర్లమూడిలో సత్సంగం పెట్టిన నెలరోజుల తర్వాత వెళ్ళినాను. అప్పటికి నాకు రొమ్ములో గడ్డలేచి ఆపరేషన్ చేసి మూడు సంవత్సరాలైంది. దాదాపు నెలవరకు సత్సంగానికి కొబ్బరికాయ, అగరు వత్తులు ఇచ్చి సత్సంగం పూర్తి అయ్యే వరకు వుండలేక వచ్చేసేదాన్ని నా జబ్బు గూర్చి గురువుగార్కి చెప్పి ఊది తీసుకున్నాను. ఊది తిసుకొన్న వారము రోజులకి కోయబాలుని రూపంలో వచ్చి నడుముకు తాయెత్తు కట్టి నీ బాధలు అన్నీ తీరిపోతాయి అని చెప్పారు. అప్పుడు బాబా వున్నారు అనిపించింది. శ్రీశైలంకు గురువుగారు వస్తే సత్సంగంలోని సభ్యులందరితో నేను శ్రీశైలం వెళ్ళాను. నాలోవున్న బాధ గురువుగారికి చెప్పగా నాకు ఊదీ, పెద్ద దానిమ్మకాయ ఇచ్చారు. శ్రీశైలం నుంచి వచ్చిన వారం రోజులకి తెల్లవారుఘామున నాల్గు గంటలకు మాగన్నుగా నిద్ర పట్టి వుండగా బాబా డాక్టరుగారి రూపంలో వచ్చి కుడివైపు రొమ్ములోని గడ్డ ఆపరేషన్ చేసి, గిన్నెలోపెట్టి, మౌనంగా వెళ్ళిపోయారు. లేచిన తరువాత తేలికగా హాయిగా వుంది. గడ్డవున్న మూడు సంవత్సరములు చాలా బాధగా, భోజనం కూడా చేయలేక వుండేదాన్ని. నాకూతురు పదహారు సంవత్సరముల అమ్మాయి చనిపోయింది. గురువుగారి దర్శనము తరువాత మనస్సు హాయిగా వుంది. చికాకులన్ని పోయాయి. 1996వ సంవత్సరము ఏప్రియల్ 7వ తేదీన శిరిడీ మొదటిసారిగా వెళ్ళినాను. వెళ్ళి వచ్చిన తరువాత మనస్సు తేలికగా, ఆనందంగా వుంది. మా ఆయన పేరు కొండేటి సాంబశివరావుగాను నిమ్మకాయల వ్యాపారం చేసేవారు. 1995వ సం|| విజయదశమికి ముందు మావారు లారీ మీద నుండి కింద పడిపోగా శ్రీ సాయిబాబావారు చిన్న దెబ్బకూడా తగలకుండా కాపాడారు. రెండు లారీల మధ్యన పడినా, చిన్న గాయముకూడా లేకుండా కాపాడినారు. అప్పటినుండి బాబాగారు, గురువుగారు వున్నారని, నాకు పూర్తిగా నమ్మకం కలిగింది. మా వారికి వున్న తాగుడు అలవాటును కూడా గురువుగారు తప్పక మాన్పిస్తారని నా నమ్మకము. నా కూతురు చనిపోయింది అని ఒకరోజు బాధ పడుతుండగా మా బాబాయి గారి రూపంలో బాబా వచ్చి "పోయిన కూతురు రాదు నీవు బాధ పడకు బాబా వంక చూడు" అని చూపించారు "నిశ్చింతగా వుండు" అని చెప్పారు. బాబా వారు నాకున్న రక్తం పడే జబ్బును కూడా ఊదీ ద్వారా తగ్గించారు.

శిరిడీ వెళ్ళినప్పుడు గురువుగారితో ఈ విధంగా చెప్పాను. నాలో వున్న బాధ మీకు శ్రీశైలంలో చెప్పాను. ఎక్కడ భజన జరిగినా, నేను వెళ్ళే శక్తిని, ఓపికను ఇమ్మని అడిగినాను. గురువుగారు అట్లాగే అని చెప్పినారు. నాకు మీ మీద ప్రేమ వుందో లేదో నాకు తెలియదు కానీ, నాపట్ల మీకు ప్రేమవుంది అని గురువుగారితో శిరిడీలో చెప్పాను.

తేది. 23 - 06 - 1996 శ్రీమతి కొండేటి జయలక్ష్మి, సంగం జాగర్లమూడి.

## నన్ను నమ్మిన వారిని నేనెన్నడూ పతనం కానివ్వను

## "అడిగిందేమో బాబాని ఇచ్చిందేమో గురువుగారు"

మా 10వ తరగతి పరీక్షా ఫలితాలు వెలువడిన తర్వాత అంటే 1992వ సం|| మే నెల 12వ తేదీ తర్వాత కొద్ది రోజులకే నేను మా అమ్మ, తమ్ముడు, మరికొంతమంది గురు బంధువులు కలిసి షిరిడీ వెళ్ళి గురువుగారి సన్నిధిలో గడిపే మహద్భాగ్యం కలిగింది. కానీ నేనప్పుడు దాన్ని నాకు కలిగిన ఒక అవకాశంగా భావించానే తప్ప మహద్భాగ్యంగా భావించలేదు. అందుకు కారణం ఆయన ఆధ్యాత్మికోన్నతిని గుర్తించలేని నా అజ్ఞానం. ముఖ్యంగా నేను వెంకటగిరిలో ఉండటం వలన నాకు ఆయన పట్ల కల్పించబడ్డ అపోహలు కూడా కారణం కావచ్చు.

షిరిడీలో వారం రోజులు గడిపిన తర్వాత నేను తప్ప మిగిలిన వాళ్ళందరూ బయలు దేరారు. నాకు వెళ్ళాలని ఉన్నా గురువుగారు నన్ను చీవాట్లు పెట్టి మరీ షిరిడీలోనే ఉంచేశారు.

మా అమ్మ వెళ్ళిపోయేటప్పుడు నా దగ్గర ఎక్కువ డబ్బులుండ కూడదనో లేక గురువుగారే అలా చేశారో తెలియదు గాని నాకు కేవలం రూ 40/- మాత్రమే యిచ్చి వెళ్ళింది. అలా వాళ్ళు వెళ్ళిన మూడు రోజుల లోపలే నేను 40 రూపాయలు ఖర్చు పెట్టిపేశాను. నాదగ్గర ఎక్కువ పైకంలేదని తెలిసి కూడా అలా ఎందుకు ఖర్చు పెట్టానో నాకప్పుడు అర్థంకాలేదు. తర్వాత రెండు రోజులు బాగానే వుంది. ఆ తర్వాత మొదలయ్యాయి ఇబ్బందులన్నీ చూసినవన్నీ కొనుక్కోవాలనిపించింది. ఏమన్నా కొనుక్కుని తినాలంటే నయాపైసాలేదు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. పోనీ ఎవర్నయినా అడిగి తీసుకుందామంటే చచ్చేంత మొహమాటం అడ్డొచ్చింది. అదీగాక అందరూ అప్పుడే పరిచయమైన వాళ్ళు. వాళ్ళ దగ్గర నా కింకా అంత చనువు పెరగలేదు. ఇలా నాదగ్గర డబ్బులు లేక ఎవరికీ చెప్పుకోలేక మందిరానికి వెళ్ళి బాబాను ప్రార్థించాను "బాబా నాకు దార్లో ఎక్కడైనా 50 రూపాయలు దొరికేటట్టు అనుగ్రహించు తండ్రీ అని అలా వరుసగా రెండ్రోజులు ప్రార్థించి తిరిగి వెళ్ళేటప్పుడు రోడ్డు మీద జాగ్రత్తగా చూస్తూ వెళ్ళేవాడిని 50 రూపాయల కోసం. ఎవరో పారేసుకున్న సొమ్మును ఆశించటం తప్పని తెలిసినా, బాబాను మూడవ రోజు కూడా అలానే ప్రార్థించి ఆశ్రమానికి వెళ్ళాను. నేను ఆశ్రమానికి వెళ్ళిన కాసేపటికి గురువుగారు నన్ను పిలిపించారు. మామూలుగా ఆ సమయములో ఎవరికీ దర్శనమివ్వని గురువుగారు నన్ను అలా పిలిపించే సరికి కొంత ఆశ్చర్యంతోనే వెళ్ళాను. అపుడు గురువుగారు నాతో "ఏరా నీ దగ్గర డబ్బులున్నాయా" అని అడిగారు. నేను లేవని చెప్పటంతో అక్కడే వున్న గుప్తా గారితో "గుప్తాగారు వీడికి యాభై రూపాయలు ఇవ్వండి" అని చెప్పి మళ్ళీ నాతో "నీ కిష్టమైనవి కొనుక్కొని తినునాన్నా" అని ఎంతో ప్రేమగా చెప్పి ఒక అద్భుతమైన చిరునవ్వు నవ్వారు. నేను అలాగే చేష్టలుడిగిన వాడినై బయటకు వచ్చాను. కాసేపు తర్వాత మళ్ళీ గురువుగారు నన్ను పిలిపించి సరిగ్గా యాభై రూపాయలు ఆయనే స్వయంగా నాచేతికిచ్చారు. అంతే ఆ దెబ్బతో నాకు ఆయన పట్ల వున్న అపోహాలన్నీ పటాపంచలయ్యాయి. ఇక్కడ అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమంటే నేను షిరిడీకి రాకముందు మానాన్నగారు గురువుగారి గురించి చెప్పినపుడల్లా ఆయన బాబా అంతటి స్థాయికి చేరుకున్నారని చెప్పేవారు. నాకు అది ససేమిరా నచ్చేది కాదు. మా నాన్న గారు చెప్పిన విషయాన్ని నిరూపిస్తూ

గురువుగారి పట్ల నాకున్న అపోహలను తొలగించారు. ఈ లీల ద్వారా ప్రపంచానికి కూడా వారు చెప్పదల్చుకొన్న దేమిటో యిప్పుడు నేను చెప్పనక్కర్లేదు. ఈ అద్భుత లీలా విలాసంలో పాత్రధారినై తద్వారా ఆసద్గురు మూర్తి ముంగిట నిలిచే అనేక మంది బిచ్చగాళ్ళలో నేను ఒక దరిద్రుడనయినాను. చేసేవన్నీ పెధవపనులే అయినా, మంచి పంట మధ్య కలుపుమొక్క లాంటి నన్ను తీసి పారేయకుండా, నాక్కూడా, నీరుపోసి ఎరువు పెట్టి పెంచే గురువుగారి ప్రేమ తత్త్వాన్ని గూర్చి మూర్తీభవించిన సాయితత్త్వమే ఆ దివ్య స్వరూపమని ఎంత చెప్పినా, ఏమి చెప్పినా కొంతే చెప్పినట్లు అవుతుంది.

తేది. 10 - 07 - 1996 పి.అనిల్, S/o. సాయిప్రసాద్, వెంకటగిరి.

## "బాబా ప్రసాదించిన మధురఫలమే శరద్బాబూజీ"

"సాయి సాధనా స్వరూపులు, గురుదేవులు శరత్ బాబు గారి పాద పద్మములకు హృదయ పూర్వక నమస్కారములతో" నాకు వారి దర్శన భాగ్యము 1990వ సంవత్సరములో జరిగినది. నేను షిరిడీ వెళ్ళు సందర్భములో సాయి పథం పత్రికకు సంబంధించిన సమాచారముతో ఉత్తరము వ్రాసి మన ఆశ్రమములో ఇమ్మని పంపుతూ, గురుదేవుల దర్శనము తప్పకచేసుకొని రమ్మని పంపినారు తెనాలి సత్సంగంలోని గురుబంధువు. మొదటిసారి దర్శనములో భయం వేసింది. వారిని తాకగానే మనస్సుకు ప్రశాంతత కల్గినది. రెండవసారి వారిని దర్శించవలయునని కోరిక కల్గినది. మళ్ళీ దర్శనమునకు వెళ్ళవలెనని అనిపించినది. తరువాత కుటుంబ సభ్యులతో వెళ్ళి దర్శించుకున్నాను. ఆరుసార్లు శిరిడీ సాయినాథుని దర్శించుకొన్నా, అనేక సార్లు అనేక కోరికలతో వెళ్ళినను, గురుదేవుల సన్నిధిలో ఏరోజు నా సమస్యలు మనస్సు విప్పి చెప్పలేదు. కాని వారి దయ వల్ల నా సమస్యలకు వారి సన్నిధికి వెళ్ళివచ్చిన వెంటనే పరిష్కారము లభించినది. మూడవసారి శిరిడీ దర్శనము జరిగినది. బయలు దేరేటప్పుడు గురువుగారిని దర్శించి సెలవు తీసుకొని వెళ్ళవలెనని మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎదురు చూచినాము. గురుదేవుల దర్శనము కాలేదు. నాతోవచ్చిన ఇద్దరు స్నేహితులు ఎదురుచూస్తున్నారు. అరగంట టైము ఉన్నది బస్సు బయలుదేరుటకు, మనము వెళ్ళాలి అని ఆదుర్దాపడుచున్నారు. నేను పట్టుదలతో ఆశ్రమములో 1వ నెంబరు గదిలో ఎదురుచూచుచున్నాను. 3గం|| 5 నిమిషములకు విపరీతముగా వర్షము కురియుచున్నది. 3 గం|| 20 నిముషములకు గురువుగారు కబురు చేసినారు. అప్పటి వరకు మాలోవున్న ఆదుర్దా తీరి ఆర్తిగా గురువుగార్ని దర్శించుకున్నాము. వారు మాకు ఊదీ యిచ్చి కూర్చోమన్నారు. బయట వర్షము పడుచున్నది. మాకు మళ్ళీ ఆదుర్దా. గురువుగారు ధ్యానములో వున్నారు. కళ్ళు తెరిస్తే చెప్పి బస్సు దగ్గరకు పరుగెత్తుకొని వెళ్ళదామని మా ఆశ. ఇట్లా 10 నిముషములు జరిగినది. గురువుగారు కళ్ళు తెరచి మావైపు చూచి బయలు దేరి వెళ్ళమని ఆజ్ఞ ఇచ్చినారు. గది బయటకు వచ్చేటప్పటికి వర్షము ఆగిపోయినది. మదిలో బాబాను దర్శించుకొని బస్సువద్దకు వెళ్ళినాము. అప్పటి దాకా బస్సు బయలు దేరటానికి స్టీరింగు ట్రబులుతో అవస్థపడుచున్నాడు డ్రైవరు. మేము ముగ్గురం బస్సులో కూర్చోగానే బస్సు బయలుదేరినది. 10 నిమిషములు ఆగిన వర్షం కూడా విపరీతంగా దారిలో అరగంట కురిసినది. ఇది నామొదటి అనుభవము. నా స్నేహితులకు కూడా గురువుగారి మీద వారికి ప్రేమ కల్గినది. ఈ సంఘటనకు ప్రత్యక్షసాక్షి శ్రీ డా|| సాయి వరప్రసాద్ గారు.

2వ సంఘటన గురుదేవులు తిరుమల వచ్చినప్పుడు జరిగినది.

నేను దర్శనమునకు వెళ్ళగానే వారు మాతమ్ముని భార్య ఆరోగ్యము గురించి ప్రశ్నించినారు. మామూలుగా గురుదేవులు మా తల్లిదండ్రుల యోగక్షేమములు, కుటుంబ యోగక్షేమములు అడుగుతారు. గురువుగారు అడిగేటప్పటికి, నాల్గురోజుల క్రితమే ఒంగోలులో మా మరదలు నెలలు నిండకముందే 7వ నెలలో

అతి ప్రమాద స్థితిలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీనిని బట్టి గురువుగారు తమ శిష్యులను, వారి కుటుంబాలను ఎల్లప్పుడు కాపాడుతారని స్పష్టమౌతోంది. వారి మీద భారము వేసి బాబా నామస్మరణ, సచ్చరిత్రపారాయణము ఎల్లవేళల చేయుచున్నంత వరకు అనుగ్రహము తప్పక కలుగును.

సద్గురు దేవులు మనకు బాబ ప్రసాదించిన దివ్యసాధనా తపస్వి. శరత్ బాబూజీ తిరుపతి సంఘటన తరువాత ఇంతవరకు నేను రోజూ పూజించే, తలంచే, అనేక దేవుళ్ళ ఆరాధన, శనేశ్వర పూజలు, ఆంజనేయ స్వామి వారి పూజలు చేయాలనే తలంపు వీగిపోయినది. బాబానే గురువుగా తలంచుట నాకు తెలియకుండా అలవాటు అయినది. 20,25 సం|| నుండి పూజించేదేవుళ్ళను పూజించే అలవాటు పోయినది. ఆ సంఘటనతో నాకు గురుదేవుల మీద అచంచలమైన భక్తి, విశ్వాసములు ఏర్పడినవి. శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ, బాబా తన భక్తులకు ప్రసాదించిన ప్రత్యక్ష దైవమని నాతలంపు.

పి. కృష్ణ కుమార్ (బాబు), తెనాలి.

## డాక్టర్ + డాక్టర్ + డాక్టర్ + డాక్టర్

నేడు ఎందరో బాబా అనుగ్రహంతో గురువుగారి వద్దకు వస్తున్నారు. సాయి పథంలో పయనిద్దామని, సాయి బాటలో నడుద్దామని గురువుగారి ఆశీస్సులు కోరుతూ, గురు బంధువులు బుడిబుడి అడుగులు వేస్తారు. కొందరు కొన్నిటిని ఆచరిస్తారు, మరొకొందరు కొన్నింటిని అనుకరిస్తారు. ఈ వివాహ సంఘటనలోని సారం "మా సంప్రదాయమేవేరు" అన్న బాబా పలుకులకు నిజమైన నివాళి. అర్పణ అన్న దానికి సరైన జంటవీరే. ఇది తెలుసుకొన్న మనం తంతులకు అంతం పలుకుతు గురుదేవులు చూపిన నిజమైన సాయి బాటలో నూతన సంప్రదాయానికి స్వాగతం పలుకుదామా! - "గురుకృప"

"గృహ్ణమితే సుప్రజాస్త్వాయ హస్తం మయా పత్యా...... వివాహ సమయంలో పాణిగ్రహణములో చెప్పే మంత్రం అది. మన ముందున్న పెద్దలు ఎట్లు ఆచరించిరో నేను అదే విధముగా మంచి సంతానము కొరకు నీ చేతిని గ్రహించుచున్నాను అని అర్థము. వివాహ కారణమును మానవుడు గృహస్థాశ్రమము నొంది సంతానము నొందుటకై సంస్కారబద్ధముగా చేయబడిన యేర్పాటది. సృష్టికొరకు సంతానమును పొందుటకై పొందుపరిచిన పవిత్ర యజ్ఞ కార్యక్రమము వంటిదది. ఈ కర్తవ్య నిర్వహణమునకై వివాహ కార్యక్రమములో, సమాన వర్తనము,కన్యా వరణము, కన్యాదానము, వివాహ హోమము, పాణిగ్రహణము, అగ్ని పరిచర్య, లాజహోమం,సప్తపది, నక్షత్ర దర్శనము, అను అంశములు ప్రధానములైనవి. ఇవికాక మరికొంత కర్మకాండ, మరికొంత ఆచార వ్యవహారాదులు, మరికొన్ని వేడుకలు, మోసులెత్తినవి, సంక్షిప్తరూపముగా వివాహమునకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానము విశద పడినది. పై కార్యకలాపమంతయు, అర్థవంతముగా శాస్త్ర విహితముగా చేయ గల్గినప్పుడు అవి కూడా అర్థవంతములై సత్ఫలితాన్నివ్వగలవు. కాని నేటి ఆధునిక కాలములో వాస్తవము మరుగునపడి, తంతు తలకెక్కినది. తతంగము మాత్రమే ప్రధానమైనప్పుడు అది అర్థవంతము కాజాలదు. సూత్రప్రాయముగా అందులోని సూక్ష్మమేమిటో ప్రధాన ఉద్దేశ్యమేమిటో మనకు తెలియకుండా పోతుంది. అందుకనే 'బాబా' అన్నారు "మనది మధ్యే మార్గము. మా సంప్రదాయమేవేరు". ఈ మాటను గురుదేవులు బాబా మాటగా వివరించుచుండేవారు. ఎన్నో విషయములను సందర్భానుసారముగా వివరించేవారు. దానిలోని మర్మమేమిటో, సూక్ష్మార్థమేమిటో సంప్రదాయమేమిటో, శాస్త్రమంటే ఏమిటో ఆచారమంటే ఏమిటో, గురుదేవులు చెప్పేవారు, మందమతిని, మట్టిబుర్ర గల వానినైన నాకు అప్పట్లో అర్థమయ్యేదికాదు. పైపెచ్చు మహాత్ములైన వారు అందంగా, అర్థవంతమైన మాటలు చెప్తారనుకొనేవాడిని. ఇది 1984వ సంవత్సరములోని భావన. నా అనుమానపు పొరలు 1993వ సంవత్సరములో వీడిపోయినవి.

గురుదేవులు దయా హృదయులు సులభముగా తరించుటకై మానవాళికి బాటలు వేయుచున్నారు. సాయిపథములో మనలందరిని నడిపించుటకై అహరహము కృషి చేయుచున్నారు. అందుకనియే కాబోలు 1993 సం|| అక్టోబరు నెలలో బాబా మహాసమాధి చెంది "75" సంవత్సరములు కావస్తుందని స్వర్ణోత్సవాలు పేరిట శిరిడీ సంస్థానమువారు వైభవోపేతమైన ఉత్సవాలు జరపనున్నారని "దసరా" నాటికి మనమంతా శిరిడీలో కల్సుకొని "బాబా సమాధిని" ఆరోజుకు తప్పక దర్శించి సేవలు చేసుకొన్నచో బాబా అనుగ్రహము తప్పక మనపై వర్షిస్తుందని చెప్పారు. ఒక విధంగా ఇది అపూర్వమైన, అనిర్వచనీయమైన సంఘటనయే. బాబా భక్తులకు అపురూపమైన పండుగయే. గురుదేవులు అలా అనుండటము వలన, తెనాలి, బుజ్జిపాలెం, గుంటూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, హైదరాబాదు, కత్తెవరం, వెంకటగిరి, ఆలపాడు మొదలగు సుదూర తీరాల నుండి వేలాది భక్తులు శిరిడీని సందర్శించుటకై వచ్చినారు. దూర వాసులందరికి సౌకర్యముల విషయములో లోటుబాట్లు రానీయవలదని గురుదేవులనినందున ఆ బాధ్యతలను S.V.L. గారు ఎంతో సమర్థవంతముగా నిర్వహించినారు.

24 - 10 - 93న గురు సన్నిధిలో గడిపిన గురుబంధువులంతా ఆరోజును మర్చిపోలేదు. తమ తీపి జ్ఞాపకాల పుటలలో ప్రథమమైనదిగా కొందరు అనటము నేను స్వయముగా వినియున్నాను. ఉదయం నుండి సందడి సందడిగా వచ్చేపోయే గురుబంధువులతో ఆశ్రమమంతా నిండుగా ఉంది. కళ కళలాడుతుంది. ఈ విషయాన్ని చెప్పే ముందు 22 - 10 - 93 నాటి రాత్రి సంఘటన ఒకటి గురుబంధువులకు తెలియ చేయాలి. అప్పుడు సమయం 9 గంటలు దాటింది. గురువుగారి వద్ద నేను మరికొంతమంది మున్నాం. గురుదేవులు కృపా విశేషము వలన నేను అప్పటికే నెల రోజులనుండి అక్కడేవున్నాను. అక్టోబరు రెండవ వారం నుండే చెదురుమదురుగా వాన పడుతున్నది. 20వ తేది, 21వ తేది బాగా విపరీతమైన వానపడింది. రేగటి నేలైనందున ఆప్రాంతమంతా బురదమయంగా ఉంది. 22 - 10 - 93 నాటి రాత్రి భయంకరమైన వాన ఆగకుండా 2 1/1 గంటల కాలము పడింది. నీళ్ళు రోడ్లపై పారుతున్నవి. ఇలాగైతే ఎలా ! ఎల్లుండేగదా ! పందిరి వేయాలన్నా మండపము కట్టాలన్నా ఎంత ఇబ్బంది. రేపటికంతా గురుబంధువులు వస్తారు. ఎలా ఇలాగైతే అని నేను గురువుగారితో అన్నాను. మౌనంగా చిరునవ్వు నవ్వి 5 నిమిషములు ధ్యానంలోకి వెళ్ళారు. గదంతా నిశబ్దమైంది. వానజోరు అధికమైనట్లనిపించింది. గురుదేవులు కళ్ళు తెరిచినారు. బహుశా నరేంద్ర పచ్చిబియ్యం తినుంటాడని హాస్య ధోరణిలో నేను అన్నాను. "చూద్దాం" అని అన్నారు అంతే అంతకు క్రితం వరకు ఉధృత రూపం దాల్చిన భీకర వర్షము క్షణాలలో పల్చబడింది. నేనెంతటి ఆశ్చర్యమును పొందానో నాకే తెలియదు. ప్రకృతి మీద ఎంతటి ఆధిపత్యముందో చెప్పకుండా చేసి చూపించారే ! మౌనంగా ఎవర్ని ధ్యానించారు? ఏమని సంకల్పించుకొన్నారు? మొదలగు ప్రశ్నల పరంపర మొలకెత్తినవి. S.V.L. గారు తరచుగా అంటుంటారు. "ఇక్కడ మాటలు తక్కువ చేతలు ఎక్కువ" అనే ఆ మాటలకు అర్థం తెలుసుకోటానికి నాలో అంకురార్పణ జరిగింది.

24 - 10 - 93 గురుబంధువులు ఎక్కడెక్కడి నుంచో వచ్చారు. రెండ్రోజుల క్రితం భారీవర్షం కురిసిందంటే నమ్మలేనంతగా ఆ మరుసటిరోజు నుండి విపరీతమైన ఎండకాసి భూమంతా గట్టిపడింది. నేను యిద్దరు ముగ్గురితో అన్నా వాళ్ళు నన్ను ఎగాదిగాచూచారేగాని విషయమేమిటో అడగలేదు. ఆరోజు నాకు అపురూపమైన రోజే. నేను పరవశించిన రోజే. గతములోని అనుమానపు పొరలు తొలగిపోయే సమయము వచ్చింది. ఈ రోజు ఉదయం 11.30 గం||లకు డాక్టర్ నరేంద్ర (గుంటూరు), డాక్టరు పద్మ(తెనాలి) ఈ నూతన వధూవరులకు గురుదేవుల సమక్షములో వివాహమహోత్సవము జరగనున్నది. పంచాంగాలకు అతీతంగా నిర్ణయించబడినది. ఆరోజు ఎంత వెదికినా ఏ పంచాంగములో వివాహానికి ముహూర్తమేలేదు. కనీసం పెట్టుడులగ్నం కూడా లేదు. అంటే పంచాంగాలలో ముహూర్తాలు లేవు గాబట్టి ఈ మార్గంలో వివాహం జరిపించారని భావిస్తే అదే పొరబాటు. కేవలం గురువచనమే ఇక్కడ ప్రాధాన్యతను సంతరించుకొన్నది. ఆ జంటది ఎంతటి భాగ్యమో ! ఏనాటి పుణ్య ఫలమో !! ఎన్నెన్ని జన్మల అనుబంధమో గురుదేవలకు వారితో, ఉదయం 10.30 గంటలకు వివాహ వేదికవద్దకు ఆరి తేరిన పురోహితుని వలె వేషధారణలో జి.సాయి వరప్రసాద్ రావు వచ్చాడు. గురుదేవులు

ఆశీర్వదించి వివాహం జరిపించే నిమిత్తం పంపగా వచ్చాడు. విఘ్నేశ్వర పూజ, మంత్ర తంత్రాలకు, తావే లేదచ్చట. తంతు చూద్దామన్నా కనిపించలేదచ్చట. ఒక రోజున గురుదేవులు మాటల్లో ఏమన్నారో 10 సంవత్సరముల తరువాత ఆ మాటలను ఆచరణలో వాస్తవంగా జరిపి చూపించినారు. సాయివర ప్రసాదరావు ముఖతః.

మొదట దంపతులిద్దరిచేత "బాబా" పూజ చేయించారు. "ఆరతి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తరువాత గురు వందనము, గురుస్తుతి, కార్య క్రమాదులను గాపించారు. వధూవరులిరువురి చేత "బాబా" నామాన్ని పలికిస్తూ మంగళ సూత్ర పూజ చేసినారు. దాన్ని బాబా పాదాల వద్ద ఉంచారు.

వధూవరులిద్దరు వస్త్రాలు ధరించటానికి వెళ్ళారు. గురుబంధువులకు గాని, కన్న వారికిగాని, కొన్ని ఆలోచనలుండవచ్చు. వాటిని తొలగించటానికా అన్నట్లు ఆ సందర్భములో కొన్ని మాటలు చెప్పారు. వివాహమంటే ఏమిటో, కొన్ని మంత్రాలు చదివి, వాటికి గల అర్థాన్ని వివరించారు. ఆ వివాహము ఎంతటి అపురూపమైనదో సాయి వరప్రసాదరావు వివరించిన మాటల్లోని సారాంశాన్ని వివరించటము అవసరమని నా భావన.

ఆర్భాటాలతో, వైభవాలతో, తమ వైభవానికి తగినట్లుగా, ఆకాశమంత పందిరి, భూదేవంతటి అరుగు, ముత్యాల ముగ్గులు వేసి, రంగ రంగ వైభోగంగా వివాహం జరపాలని తల్లితండ్రులకు, వధూవరులకు వుండటము సహజము.పైగా మంత్ర తంత్రాలు తతంగమన్నది కనిపించకపోయే సరికి ఏదో వెలితి వారి హృదయాలలో ఉంటే ఇక్కడ జరిగిన వివాహానికి అర్థము లేకుండా పోతుంది. ఇక్కడా ఆకాశమంతటి పందిరి, గురుదేవుల ఆశీర్వచనమే, భూదేవంతటి అరుగు వారి హస్తాలే. సాక్షాత్తు సద్గురు సన్నిధిలో జరిగే వివాహమంటే సామాన్య విషయము కాదు. ఆయన చూపులే వారిని నిరంతరం రక్షించే కవచము. మనపాలిటి కల్పతరువు. దేవాధిదేవుడు. ఆధ్యాత్మికత అను మహోన్నత వృక్షానికి పండిన మధురాతి మధుర ఫలము శరత్ బాబుగారు. దైవ స్వరూపమే సాక్షాత్ బ్రహ్మ స్థానములో కూర్చుండి వివాహం జరిపించేంతటి మహద్భాగ్యము ఈనాడు ఈ జంటకు లభించింది. కోటాను కోట్ల రూపాయలు వెచ్చించినా ఇంత అపురూప సన్నిధిలభించదు. ఇంతకంటే ఆనందించ దగిన విషయముందా! ఒక రకంగా మనమంతా అదృష్టవంతులమే.

వివాహమందలి కొన్ని మంత్రాలకు అర్థాలు చెప్పి త్రివర్గ సాధనమైన (ధర్మ, అర్థ, కామ) సాధనాన్ని పురుషుడు భార్య ద్వారా సాధించుకొను ఒకానొక ప్రక్రియనే వివాహమంటారు నాలుగు ఆశ్రమాల ద్వారా పురుషుడు పురుషార్థ సాధనను సాధించగల్గినప్పటికి గృహస్థాశ్రమమే ఎంతో అనుకూలమైనది. సముద్ర తరణానికి నావలా ఆకాశ గమనానికి విమానములా, సంసార తరణానికి భార్యయు అలాంటి సాధనయే. భర్తలో భార్య అర్థశరీరాన్ని వివాహం ద్వారా పొందగలిగి "అర్థాంగి" స్థానాన్ని పొందుతుంది. ఆ నమ్మకతోనే మెట్టింటి బరువు బాధ్యతలను ఆమె స్వీకరించిన కారణంగా పురుషుడు నిశ్చింత పడగల్గుతున్నాడు.

మానవునికి ఇంద్రియాలతో పోరాటమన్నది తప్పనిది. ఒంటరియై నిల్చి ఇంద్రియాలను జయించటమన్నది ఇతరాశ్రమాలలో కష్టభూయిష్టము, తేలికైందికాదు. అనుకున్నంత సులువుకాదు. స్త్రీని భార్యగా పొంది గృహస్థుడై భార్య సహకారంతో ఇంద్రియాలను నిరోధించగల్గుతున్నాడు. సర్వవిధాల సహకారణియైన భార్య వలన భర్త తరించ గల్గుతున్నాడు. జీవిత కాలమంతా సేవించిన ఆమె ఋణమును తీర్చుకోలేడని.......... సందర్భోచితమైన విషయాన్ని సాయి వరప్రసాదరావు వివరించాడు.

మాంగల్యధారణ జరగబోనున్నది, ధవళకాంతులు విరజిమ్ముతుండగా, నడకలో కొదమసింగపు అడుగులను స్ఫురణకు తెచ్చువిధముగా, గంభీరముగా, ఠీవిగా, గురుదేవులు కళ్యాణ వేదికకు వచ్చారు. S.V.L. గారు కొందరు గురుబంధువులంతా గురుదేవులను వెన్నంటినారు. గురుదేవులు వివాహ వేదికపైకెక్కి

బాబాకు నమస్కార శతములందించి మాలవేసి ఆశీసులైనారు. మాంగల్యము నందుకొని తమ చేతిలోవుంచుకొని నేత్ర ద్వయమును మూసి అనంతరము వరుని చేతికిచ్చారు. ఆశీర్వదించారు. తిలకించిన వారందరిని పులకితగాత్రులను చేసినారు. మాంగల్య ధారణ పూర్తి అయినది. వధూవరులిద్దరిని ఆశీర్వదించి నిజమైన సాయి మార్గంలో వివాహమును జరిపించారు. "బాబా" చెప్పిన "మా సంప్రదాయమే వేరు" అన్న మాటలలోని భావార్థమేమిటో నాకు తెలిసింది. ఈ వివాహము ద్వారా సంప్రదాయానికి ఎక్కడా భంగము వాటిల్లలేదు. అర్థవంతమైన ఆచారాన్ని ఆచరణాత్మకంగా అందరు ఆనందించి హర్షించేలా చేసారు గురుదేవులు.

మరో అద్భుత విషయాన్ని చెప్పాలి. మరో అరగంటలో వివాహం జరగబోతుందనగా ఎందుకనో గురువుగారన్నారు. బాబాకు బాగా దగ్గరగా ఉండే కుటుంబానికి చెందినవారి ఈ వివాహానికి వస్తే బాగుంటుంది. "ముస్లిం"లైతే ఇంకా బాగుంటుందని అన్నారు. ఆకాశవాణి, అంతర్వాణిగా సమాచారము అందించిన విధముగా అయిదు నిమిషాల్లో ఇద్దరు "ముస్లిం"లు వచ్చారు. గురువుగారిని దర్శనం చేసుకోవాలని వారిద్దరు తండ్రీ కొడుకులు. వారెవరంటే అబ్దుల్ బాబాకు స్వయాన మనమడు, అతని కుమారుడు ఇద్దరూ వచ్చారు.

అలా గురువుగారు అనుకోవటమేమిటో వాళ్ళలా రావటమేమిటో నాకు ఆశ్చర్యమేసింది. క్షణకాలంపాటు విస్మయవదనముతోవున్న నన్ను గురుదేవుల పిలుపు స్వస్థత స్థితికి తెచ్చింది. సమీపంలో ఉన్న నాకు వారిద్దరిని పరిచయం చేసి వారికి నన్ను పరిచయం చేసినారు. ఈ రోజు ఇక్కడ జరిగే వివాహాన్ని దర్శించి విందుచేసి వెళ్ళమనినారు. వారిరువురుని గురుదేవులు నూతన వధూవరులను ఆశీర్వదించమనినారు. ఏమనుకోవాలో నాకు మాత్రం అర్థం కాలేదు. వివాహానంతరం గురువు గారితో పాటు కలసి అందరు భోజనాలు చేసే మహదవకాశాన్ని కల్పించారు. అందరు తృప్తిగా భోజనం చేశారు. కళ్ళార గురుదేవులను చూస్తూ ఆక్షణంలో నాలో కల్గిన భావాలు అనంతాలు. ఆ చూపులో ఎవరెవరికి ఏమేమి కావాలో చూడండి అనే సందేశము కనిపించింది. అందరం బాబా బంధువులం ఈ రోజు బాబా మహాసమాధి చెందిన రోజు ఇది బాబా ప్రసాదం తప్పక అందరం స్వీకరిద్దాం అన్న భావన, దేముడంటే అందే వాడేనను భావనలు నాలో దొంతరదొంతరలుగా కలిగినవి. వేలాది మంది గురుబంధువులు ఒకే పందిరి క్రింద కనిపించిన సన్నివేశమును అవలోకిస్తే ఇదో ప్రపంచమని, సాయీ ప్రపంచమని బాబా లోకమని అనిపించింది.

ఈ వివాహంలో వరుడు, వధువు డాక్టర్లు కావడం విచిత్రం కాదు. ఇలా ఎన్నో వివాహాలు జరిగినవి. ఈ వివాహాన్ని అత్యంత వైభోవోపేతంగా కన్నుల పండుగగా ఆదర్శవంతంగా నిర్వహించిన మన గురువుగారు "డాక్టరు" వరుడు "డాక్టరు". వధువు "డాక్టరు". ఇక్కడ వరకు బాగానే వుంది కొసమెరుపేమిటనగా చేయించిన పౌరోహితుడు సాయి వరప్రసాదరావు గూడా డాక్టరేట్ కావటం ఇందులోని విచిత్రం. అదే గురుదేవులు చేసిన చమత్కారం.

గురు చరణ దాసుడు, షిరిడీ.

"సాంగె తయాస్ మాఝె మాన్, పత్రికా ఠేవీగుండాళూన్..........
జన్మపత్రికా పాహా నకా........సాముద్రికా విశ్వాసూ నకా...
ఠేవే విశ్వాస్ మజవరీ."

"నేను చెప్పే మాట వినుకో! జన్మకుండలిని చుట్టచుట్టి అవతల పారెయ్!
జాతకాలు చూడొద్దు! సాముద్రికాన్ని నమ్మొద్దు!
నాపై విశ్వాసముంచు!"
.................శ్రీ సాయి సచ్చరిత్ర అధ్యాయం 29 : ఓ.వి. 108 - 110

## ఆ చేయి ఎంత హాయి

ప్రశ్న :- మీ ద్వారా నాకు "బాబా" పరిచయమైనారని నాధృడ విశ్వాసం ?

జవాబు :- మౌనంగా ఉండిపోయారు
(నేను మాత్రం వార్ని అలా చూస్తూ ఉండిపోయాను. అలా చూస్తున్నప్పుడు ఎన్నో ఆలోచనలు నాలో అంకురార్పణమై పెదవుల మీదికి మాటల రూపంలో దొర్లుతున్నాయి.)

ప్రశ్న :- మీ ద్వారా నాకు "బాబా" అంటే ఏమిటో తెలిసింది, మొదట "బాబా" వైద్యునిగ, ఆ తరువాత దైవముగా, ఆతరువాత అంతకన్న మిన్నయైన సద్గురువుగా, అ తరువాత సమస్తము బాబాయేనని, ఆయన ఆజ్ఞలేకుండా ఆకైనా కదలదను విషయము, "బాబా" కన్నా భిన్నమైంది ఏదీ లేదని ప్రతిదీ "బాబా"యేనని తెలియచేసారు?

జవాబు :- ఆ........ ఆ తెలియజేసింది కూడా నేను కాదు. ఆయనే, "బాబా"ను గురించి నేను తెలుసుకున్నది అప్పుడప్పుడు మీకు చెప్పిన విషయాలు మీ హృదయానికి నచ్చటానికి కారణం నా మాటలు కావు. ఆయన లీలలు, భక్తులను ఆయన ఆదరిస్తున్న తీరు, మహోన్నతమైన వారి చరిత్ర ఇత్యాదులు కారణాలు కావచ్చు.

ప్రశ్న :- అలా ఎంత మంది ఎందరి హృదయాలకు హత్తుకొనేలా చెప్పగలరు. "బాబా లీలలు" గాని, సత్యాన్ని అంటిపెట్టుకొనిన వాస్తవాలేమిటో కంటి ముందు కదలాడు కథలలా,! తిక్కన కవితలా, ! ఎవరు వర్ణించగలరు. ఎవరు చూపించగలరు. ఇంకెవ్వరికైనా అది సాధ్యమా?

జవాబు :- బాబాను గురించి తెలిసిన వారెవరైనా సరే! అంత బాగ విశదీకరించగలరు. ఆ ఘనత ఆ గౌరవము "బాబా"దేగాని, వ్యక్తులది గాదు.

ప్రశ్న :- ఇప్పటికి ఎంతో మంది చెప్పారు. విన్నాము మీ అంత బాగ ఎందుకు చెప్పలేక పోయారు?

జవాబు :- నన్ను మీరంతా ఎక్కువ సార్లు కలుసుకొనే అవకాశం దొరికింది. పై పెచ్చు "బాబా"ను గూర్చి తెలుసుకోవాలనే తపన మీ హృదయాలలో వున్నందున నా మాటలు నచ్చి వుంటాయి.

ప్రశ్న :- మీ మాటలు నచ్చిన కారణంగానే గదా, మేమంతా "బాబా" భక్తులమైనది. అలాంటప్పుడు మీరే మా అందరికి......... ఇంకా అన బోతున్నాను?

జవాబు :- నీ లాజిక్ నా దగ్గర పనిచేయదు. నీవు తర్కం చదువుకొని వుండవచ్చు. ఒక మాట నుండి మరో మాటకు లింకులు వేసి ఇరికించాలనుకొనే నీ వాక్చాతుర్యాన్ని మానుకో!

అద్దములో ప్రతిబింబము కనిపించినంత స్పష్టముగా నా బుద్ధి యందలి ఆలోచనలు ముందుగానే వీరికెలా తెలిసాయి. మూసివుంచిన పుస్తకపు పుటలలోని వాక్యాలను శరద్బాబుగారెలా చదవ గల్గినారు. నా ఊహ నాకు మాత్రమే స్వంతము గాదా? నా తెలివి తేటలు నావి కావా? మున్ముందు నేనేమి మాట్లాడబోతానో ముందుగా వారికెలా గోచరమైనది. నా హృదయాన్ని ఇంత చక్కగా ఎలా చదవ గల్గుతున్నారు? నా తర్కం వారికి ముందు

గానే ఎలా తెలిసింది. నా భావార్థంలో వారెలా ముందుగానే విహరించగల్గుతున్నారు. నా అక్షరాల అలలలో వారెలా నౌకా విహారం చేసారు. భవిష్యత్తును చూడగల్గుతున్నారే. ఆ కొద్ది కాలంలో నాలో రేగిన ధుమారమే ఇదంతా!

1992 సం|| గురువుగారి సన్నిధిలో, శిరిడీలో, దసరా వేడుకల అనంతరం, 1993 సం|| తెనాలిలో జరగబోవు సాయి పూజా మహోత్సవాలకు రావలసిందని ప్రాధేయ పడుటకు ముందుగా జరిగిన సంభాషణల సారాన్ని అతి సూక్ష్మంగా తెలియజేసాను. ఇంతగా సంభాషణ సాగటానికి కారణం లేకపోలేదు.

1992 సం|| లో తెనాలిలో సత్సంగాన్ని ప్రారంభించిన 25 వారాలకు చిన్న వేడుక జరుపుకొనినాము. బాబా పరంగా, అనుకోకుండా S.V.L. గారు మరి కొందరు గురుబంధువులు ఆరోజు అక్కడకు వచ్చారు. "సద్గురు సాయినాథుని శరద్బాబూజీ సత్సంగ సేవాసమితి" అన్న బ్యానరు కట్టించాము. S.V.L. గారు మమ్మెంతగానో మెచ్చుకొనినారు. ఆ భావానందాన్ని గురుదేవుల ముందర వుంచినారు కాబోలు, వారం, పదిరోజుల తిరక్కుండానే నన్ను మందలిస్తూ (బాగుపడాలని) నా హృదయం గాయం కాకుండా లేఖను వ్రాసి పంపారు. ఆ లేఖ చదవగానే కళ్ళ వెంట ఆనందబాష్పాలు జలజల రాలినవి. ఆ అనుభూతిని ఆ ఉత్తరములోని భావాలను తెలియపర్చాలనే ఉంది, కాని ఇప్పుడు కాదు. శిరిడీ వెళ్ళి గురువుగారిని తెనాలికి ఆహ్వానించాలని వెళ్ళాము. వారు ఉదహరిస్తూ వ్రాసిన ఉత్తరములోని మాటలు నాకు ఇష్టం లేక సమర్థించటానికి నేను చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు.

దట్టముగా పట్టిన కారు మబ్బులు గాలికి వీగిపోతాయి. కార్చిచ్చు పెనుతుఫానుకు ఆరిపోతుంది. ఎంత లావా విజృంభించినప్పటికి జల నిధిని ఏమీ చేయలేదు. అలముకొనిన చీకటిని వెలుగు చీల్చిపారవేస్తుంది. సందేహములు సర్పంలాబుసలు కొడితే గురువనే గరుత్మంతుడు సాక్షాత్కరించగనే, సందేహములనే సర్పం పారిపోతుంది. మన గురువుగారు అంతే. నాలాంటి వారిని ఎందరిని చూచి వుంటారు. అప్పటి సన్నివేశాన్ని మీ కళ్ళ ముందుంచే ప్రయత్నం చేస్తాను. మొత్తం మీద నా ప్రయత్నం విఫలమైంది వాదనలోగాని, తర్కం వలనగాని, మనదారిలోకి వారిని మళ్ళించలేమను విషయం తేట తెల్లమైంది. వారిని మన మార్గం వైపుకు మళ్ళించాలనుకోవటం అతిప్రయాసే. నా బుద్ధిని మరో మార్గంలో పయనింపజేస్తూ, వారిని మళ్ళీ ఈ క్రింది విధంగా ప్రశ్నించసాగాను.

డా|| జి. సాయి వరప్రసాదరావు, రేపల్లె.

*వివరాలు వచ్చే సంచికలో*

*"న దేవో విద్యతే కాష్ఠే న పాషాణే న మృణ్మయే/*
*భావేషు విద్యతే దేవః తస్మాద్భావోహి కారణం||"*

*('కొయ్యలోను, రాతియందు, మట్టిలోను దేవుడు లేడు! భావమునందే*
*దైవమున్నాడు. దానికి భావనయే కారణమై వున్నది ')*

# "వ్రాసాను ఉత్తరం పొందాను ప్రయోజనం"

సమర్థసద్గురు సాయినాథుడంటే నాకు భక్తి ప్రపత్తులు ఉన్నాయి. బాబా అవతారమైన శరద్బాబూజీ గారి గురించి, ఆయన మహిమ గురించి విన్నాను. ఆయనకి మన బాధలు చెప్పుకుంటూ లెటరు వ్రాస్తే ఆయనే మనని కాపాడుతారని చదివాను-విన్నాను. వారికి లెటరు వ్రాద్దామని అనుకుంటూనే అశ్రద్ధ చేసాను. ఎందుకో ఒకరోజు ఇవ్వాళ ఏమయినాసరే గురువుగారికి లెటరు వ్రాయవలసినదే అని నా మనస్సుకు అనిపించి నా కష్టాలన్నీ వివరిస్తూ గురువుగారికి లెటరు వ్రాసాను.

ఆ లెటరులో మా అబ్బాయికి ఇంజనీరింగ్ లో సీటురానందుకు బాధపడుతూ ఆయనకి విన్నవించుకున్నాను. ఆ లెటరు వ్రాసాక 10,12 రోజులకి మావాడికి రెండవసారి కౌన్సిలింగ్ కు వెళ్ళడానికి అవకాశం వచ్చింది. వాళ్ళ నాన్నగారు వాడిని తీసుకుని హైదరాబాద్ వెళ్ళారు. సీటు వస్తుందనే నమ్మకం లేదు. "కాని ఈ సారి కూడా చూద్దాము" అని వెళ్ళారు. నేను "ఛార్జీలు కూడా దండగ" అనుకున్నాను. అయితే " ఏది జరిగినా మీదే భారం" అని గురువుగారి మీదే భారం వేసాను. అంతే - హైదరాబాద్ కౌన్సిలింగ్ నుండి వాళ్ళు తిరిగి వచ్చి "విజయవాడలో ఫ్రీసీటు వచ్చింది" అని చెప్పారు. ఇదంతా గురువుగారి మహిమేనని నేను నమ్ముతున్నాను. గురువుగారు మమ్మల్ని కరుణించారనే నమ్మకంతో నా అనుభవాన్ని అందరికీ తెలియజేస్తున్నాను.

20-12-98 పి. అన్నపూర్ణ, తెనాలి.

